ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 4 డిసెంబరు 2025

లోకల్‌కే ప్రాధాన్యం

● అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి కసరత్తు ● 80లో 51పోస్టులు మున్సిపాలిటీలకే..

7

స్పందన లేక..!

పోలీసుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి!

పెళ్లి పీటలపై స్వామి, అమ్మవారు



కమనీయం

భక్తరహళ్ళి నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం కమనీయంగా సాగింది. మడకశిర మండలంలో వెలసిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారితో నరసింహస్వామి కల్యాణం అట్టహాసంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు.

నేడు బ్రహ్మరథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహరాజు తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

-మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి)

ఘనంగా గంధం మహోత్సవం

● తెల్లవారుజామున బాబయ్య స్వామికి సమర్పణ ● తరలివచ్చిన భక్తులు

పెనుకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పెనుకొండ బాబయ్యస్వామి గంధం మహోత్సవాలు బుధవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3.30గంటలకు దర్గా వంశపారంపర్య పీఠాధిపతి సలావుద్దీన్ బాబా, ముతవల్లీ తాజ్‌బాబా సందల్‌మహల్ నుంచి గంధాన్ని తలపై పళ్లెంలో ఉంచుకుని మేళతాళాలు, ఫకీర్ల విన్యాసాలతో బాబయ్య దర్గా వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్వామి సమాధివద్ద పూజలు నిర్వహించారు. స్వామిని పూజించిన గంధం కోసం భక్తులు ఎగబడ్డారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొన్నారు.



పూజకు గంధాన్ని తీసుకెళ్తున్న పీఠాధిపతి సలావుద్దీన్ బాబా

అందరి దేవుడు ఒక్కరే..

● సర్వమత సమ్మేళనంలో వక్తలు



ఐక్యత చాటుతున్న మతపెద్దలు

పెనుకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాలు వేరైనా వారు పూజించే దేవతల రూపాలు వేరైనా అందరికీ దేవుడు ఒక్కరేనని వివిధ మతాలకు చెందిన పెద్దలు, వక్తలు పేర్కొన్నారు. బాబయ్యస్వామి గంధం మహోత్సవాల్లో భాగంగా స్థానిక సందల్‌మహల్ వద్ద మంగళవారం రాత్రి దర్గా పీఠాధిపతి సలావుద్దీన్ బాబా అధ్యక్షతన ఖవాలీ మహల్ వద్ద సర్వమత సమ్మేళనం నిర్వహించారు. సలావుద్దీన్ బాబా మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి కోసం తుదిశ్వాస వరకు కృషిచేస్తానన్నారు. అనంతరం వివిధ మతాలకు చెందిన పీఠాధిపతులు, కవులు, మేధావులు, కళాకారులు ప్రసంగించారు. సిక్కు మతాధిపతి జగ్‌జోత్‌సింగ్ మాట్లాడుతూ.. మనుషులంతా ఒక్కటేననీ, తారతమ్యాలు వీడి దేశసమైక్యతకు కృషి చేయాలన్నారు. క్రైస్తవ మతపెద్ద జాన్‌ప్రియనాథ్, తెలుగు కవులు తులసీదాస్, ముద్దరంగప్ప, ఉర్దూ కవులు మహ్మద్ షాహీద్, అతావుల్లా తదితరులు మత సామరస్య కవితలతో అలరించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్‌ఫారూఖ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను దర్గా పీఠాధిపతి ఘనంగా సత్కరించారు.

నాణ్యత గాలికి..

● కంకర తేలిన ప్యాచ్‌వర్క్‌లు



ప్యాచ్ వర్క్‌లపై కంకర తేలిన రోడ్డు

సోమందేపల్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): నాణ్యతను గాలికి వదిలి పనులు చేస్తే ఎలా ఉంటాయో అనేందుకు మండలంలోని చాకర్లపల్లి రైల్వేగేటు నుంచి కేతగానిచెరువు వరకు చేసిన ప్యాచ్‌వర్క్‌లే నిదర్శనం గా నిలుస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని చాకర్లపల్లి రైల్వేగేటు నుంచి కేతగానిచెరువు వరకు హిందూపురం రోడ్డులో యాన్యువల్ మెయింటెనెన్స్ స్కీం కింద రూ.10లక్షలతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్యాచ్‌వర్క్ చేయించారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో వేసిన రెండు రోజులకే కంకరతేలి అధ్వానంగా మారింది. దీనిపై జేఈ శ్రీనివాసులును వివరణ కోరగా వర్షాల కారణంగా రోడ్డుపై ప్యాచ్‌లలో కంకర తేలిందన్నారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి మరమ్మతులు చేపడతామన్నారు.

వందే భారత్‌కు ప్రశాంతి నిలయంలో స్టాపింగ్

7

అదనపు భారం



“మాగ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నా, ఇంటి నిర్మాణం ప్రారంభం చేసినప్పుడు ట్రాక్టర్ రూ.2వేలకు దొరికింది. అదే ఇసుక ట్రాక్టర్ ఇప్పుడు రూ. 4 వేలకు కొనాల్సి వస్తోంది. ఇదేమని అడిగితే చిత్రావతిలో నీరు ఉంది. ఇసుక దొరకలేదు. రైతుల పొలాల్లో నుంచి తీసుకువస్తున్నాం. అక్కడ ట్రాక్టర్‌కు రూ.500 చెల్లించాలి. అందుకే ధరలు పెరిగాయి అని చెబుతున్నారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు ఉన్నా సామాన్యులకు ఇసుక అందే పరిస్థితి లేదు.

- కత్తె పోతలయ్య, కత్తె కొట్టాల, ధర్మవరం



చిత్రావతి నదిలో గరిశనపల్లి వద్ద తవ్వకాలు

ఇసుక ధరలకు రెక్కలు!

» ఇసుక తవ్వకాలకు బ్రేక్

» కొరతతో అదనపు బాదుడు

» నిర్మాణ రంగంపై భారం



తుఫాన్ల ప్రభావంతో చిత్రావతి, పెన్నానదుల్లో నీరు

పుట్టపర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ల ప్రభావంతో జిల్లాలో ఇసుక ధరలకు రెక్కలు వచ్చాయి. తుఫాన్లతో కురిసిన వర్షాలకు వంకలు, నదుల్లో నీరు చేరింది. ఈక్రమంలో ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. ఉన్న ఇసుకకు డిమాండ్ పెరగడంతో ధర ఆకాశాన్నంటుతోంది. జిల్లాలో పలు నదులు, వంకలు, వాగులు ఉన్నా ప్రధానంగా చిత్రావతి, పెన్నా నదుల నుంచే ఇసుక ఎక్కువగా తరలిస్తారు. చిత్రావతి నదిలో కర్ణాటక సరిహద్దు నుంచి కడప జిల్లాలోకి ప్రవేశించే దాకా నీరు ఉంది. ఈ నదిలో నాణ్యమైన ఇసుక దొరుకుతుండటంతో దీనికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. నదిలో నీరు ఉండటంతో అంతంతమాత్రంగా దొరికే ఇసుకకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు (ఫైల్)

నదుల్లో నీటి నిల్వ

గత నెలలో కురిసిన వర్షాలకు జిల్లాలోని చిత్రావతి, కుషావతి, సోమావతి, సీజీ, పెడబల్లి ప్రాజెక్టులతోపాటు వాగులు, వంకల్లో నీరు ఉంది. ఈ నేపథ్యంలో నెల రోజుల నుంచి ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. దీంతో ఇసుక కొరత ఏర్పడింది. ఇదే అదనుగా ధరల పెంచేశారు. నదుల్లో నీరు పూర్తిగా తగ్గే సమయానికి ఇసుక ధర మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో గనులు, జలవనరుల శాఖ అధికారులు చిత్రావతి, పెన్నా

(మిగతా 7వ పేజీలో)

లాభసాటి వ్యవసాయమే సీఎం ధ్యేయం

రైతన్నా.. మీకోసం ముగింపు సభలో మంత్రి సవిత



సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాంపురంలో రైతన్నా.. మీకోసం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులకు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రైతన్నా.. మీకోసం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి ఏ పంటలు వేస్తే ప్రయోజనకరంగా ఉంటుందో వ్యవసాయాధికారులతో కలిసి మంత్రి వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే రైతులకు ఎంతో మేలు చేశామని అన్నారు. అన్నదాత సుఖీభవ, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేశామని తెలిపారు. రైతుల పేరుతో పార్టీ పెట్టుకున్న జగన్ అన్నదాతలను వేధించారని ఆరోపించారు. ఐదేళ్లలో డ్రిప్ ఇరిగేషన్‌ను నాశనం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణమీనన్, ఏఓ చందన, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన చిన్న, మధ్యతరహా నీటి ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం చిన్న నీటిపారుదల, హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వపై ఆరాతీశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చిన్ననీటిపారుదల శాఖ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈలు రాజస్వరూప్ కుమార్, మురళి, శ్రీనివాసులు, సీపీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

● ఏఐటీయూసీ, అంగన్‌వాడీ అసోసియేషన్



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ, అంగన్‌వాడీ నేతలు

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ, అంగన్‌వాడీ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాబున్నీషా, సంపూర్ణమ్మ తదితరులు సమస్యలు పరిష్కరించాలని జేసీ మౌర్యభరద్వాజ్, ఐసీడీఎస్ అధికారి ప్రమీలమ్మను బుధవారం కలిసి, వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు యాప్‌ల భారం తగ్గించి, కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వాలన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నేతలు దేవి, భాగ్యలక్ష్మి, శైలజ, చంద్రకళ పాల్గొన్నారు.

బైక్ రేసర్ల ఆటకట్టు..

● వలపన్ని పట్టుకున్న పోలీసులు

● 106 బైక్‌లు సీజ్



సోమందేపల్లి పోలీసు స్టేషన్‌లో సీజ్‌చేసిన ద్విచక్రవాహనాలు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన యువకులు

సోమందేపల్లి/పెనుకొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెనుకొండలో బాబయ్య స్వామి గంధం ఉత్సవాల నేపథ్యంలో పేట్రేగిపోతున్న బైక్ రేసర్ల ఆట కట్టించారు పోలీసులు. 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి పెనుకొండ, సోమందేపల్లి వద్ద వలపన్నారు. హిందూపురం, బాగేపల్లి, గౌరీబిదనూరు, గుల్బర్గా, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన యువకులు అర్ధరాత్రి వేళ ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతుండగా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. 106 బైక్‌లను సీజ్‌చేసి సోమందేపల్లి, పెనుకొండ స్టేషన్లకు తరలించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పెనుకొండ, సోమందేపల్లి, చెన్నేకొత్తపల్లి, కదిరి, గోరంట్ల, మడకశిర, రొద్దం మండలాలకు చెందిన పోలీసులు పెనుకొండ నుంచి సోమందేపల్లి వరకు జాతీయరహదారిపై ముమ్మర తనిఖీలు నిర్వహించారు. పెనుకొండలో బాబయ్యస్వామి ఉరుసు నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. సీజ్‌చేసిన ద్విచక్రవాహనాలను పుట్టపర్తికి తరలించారు. తరలించే సమయంలో సోమందేపల్లి పోలీసు స్టేషన్ వద్ద బైకర్లకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జరిమానాలు వేసి, ఇక్కడే వదిలేయాలనీ, పుట్టపర్తికి తరలించరాదని యువకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పుట్టపర్తిలో మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ వద్ద ద్విచక్రవాహనాల రికార్డులు సక్రమంగా ఉంటే చూపి. విడిపించుకెళ్లాలని పోలీసులు సూచించారు. లేనిపక్షంలో జరిమానా కట్టి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. దీనిపై సీఐ రాఘవన్ మాట్లాడుతూ.. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా జాతీయరహదారిపై ముమ్మర తనిఖీలు చేపట్టామన్నారు. అర్ధరాత్రి వేళ రోడ్లపై చక్కర్లు కొడుతున్న యువతను ఆపి, వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

పంచాయతీల్లో లూటీ!

త్వరలో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం

● అధికారులతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమాలు ● నిధులను స్వాహాచేస్తున్న వైనం ● పనులు చేయకుండానే బిల్లులు

కళ్యాణదుర్గం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో బరితెగించారు. సర్పంచ్‌ల పదవీకాలం త్వరలో ముగియనుండడంతో అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కుమ్మక్కై పనులే చేయకుండా బిల్లులు చేసుకుంటున్నారు. కంబదూరు మండలంలో అడ్డగోలుగా ప్రజాధనం లూటీ చేస్తున్నారు. మండలంలోని ఓ పంచాయతీలో ఆర్డీటీ సహకారంతో గతంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌కు ఇప్పుడు అక్రమంగా బిల్లు చేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని పనుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా కుమ్మక్కవుతున్నారు. వీటిపై జిల్లా అధికారులు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన ఇటీవల కంబదూరు (మిగతా 7లో...)

అమ్మ.. అశ్వత్థరెడ్డీ..

● విధుల్లో నిర్లక్ష్యమే కాదు.. అక్రమాలు సైతం..

● భార్య ఖాతాకు నిధుల మళ్లింపు

● రికార్డులు ఇవ్వకుండా డ్రామాలు

7

వెలుగులోకి కంబదూరు కార్యదర్శి లీలలు

బోగస్ పత్రాల పుట్ట..!

● కొమరేపల్లి సచివాలయంలో మాయలు

● ఇతర రాష్ట్రాల వారికీ బర్త్ సర్టిఫికెట్లు

● ఏకంగా 3,981 జారీ?

మడకశిర/మడకశిరటౌన్/అగళి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అగళి మండలంలోని కొమరేపల్లి చిన్న గ్రామం. అలాంటి ఊరిలో ఏకంగా 3,981 జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. పక్క జిల్లాలు, రాష్ట్రాల వారికి సైతం ఇక్కడ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఓ వ్యక్తి.. రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేయడం, వారి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టింది. ఇందులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

రాష్ట్ర అధికారుల ఆదేశాలతో..

వినయ్‌కుమార్ గుప్తా అనే వ్యక్తి 1985 ఆగస్టు 5న జన్మించినట్లు కొమరేపల్లి సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. అది బోగస్ సర్టిఫికెట్ అంటూ ఆశిష్‌కుమార్ గుప్తా అనే వ్యక్తి విజయవాడ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులు.. విచారణ చేపట్టి వాస్తవాలు తేల్చాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆ మేరకు జిల్లా అధికారులు కదిలారు. జిల్లా గణాంకాల నోడల్ అధికారి కళాధర్ మంగళవారం కొమరేపల్లి సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రాల జారీపై ఆరాతీశారు. ఇన్‌చార్జి కార్యదర్శి మహేష్‌ను విచారించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి, ఎన్ని సృష్టించారో తేల్చనున్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. ఈ సచివాలయం ద్వారా వివిధ రాష్ట్రాల వారికి 3,981 జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరైనట్లు గుర్తించారు. సంబంధిత ఇన్‌చార్జి కార్యదర్శి మహేష్‌ను విచారించగా.. సెప్టెంబరు 14న ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుని, ఐడీ పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వగా.. అందులో అప్పటికే 129 జనన ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని కూడా నిలిపి వేశామన్నారు. విషయాన్ని ఆయన ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. కాగా, బోగస్ సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

విచారణ చేస్తున్నాం: కళాధర్, జిల్లా గణాంకాల అధికారి

కొమరేపల్లి సచివాలయంలో బోగస్ సర్టిఫికెట్లు సృష్టించడంపై ప్రాథమిక విచారణ చేపట్టాం. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు పంచాయతీ సెక్రటరీ లాగిన్‌లో దాదాపు 3,981 జనన ధ్రువీకరణ పత్రాలు చేశారు. అవన్నీ కూడా ఇతర జిల్లాల నుంచి వచ్చినట్లుగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చాం. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తాం.

నెట్టికంటి సన్నిధిలో హంపి పీఠాధిపతి



హారతి తీసుకుంటున్న విద్యారణ్య భారతిస్వామి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురంలో నెట్టికంటి ఆంజనేయస్వామిని బుధవారం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామీజీకి స్వాగతం పలికారు. ప్రతి సంవత్సరం జరిగే హనుమద్ వ్రతం, దత్తజయంతి ఉత్సవాల్లో స్వామీజీ పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం విద్యారణ్య స్వామిజీ ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులకు ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో బెల్దోణ స్వాములు రామనాథ్ శాస్త్రి, వేణుగోపాలశాస్త్రి, శివశంకర శాస్త్రి, స్వామిజీ శిష్య బృందం మంజుల వెంకటేష్, ప్రదీప్ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'రైతన్నా.. మీకోసం '

అనంతపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచసూత్రాలతో లాభసాటి వ్యవసాయం విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతన్నా.. మీ కోసం కార్యక్రమం బుధవారం ముగిసింది. గతనెల 24 నుంచి రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. మంగళవారం నాటికి క్షేత్ర స్థాయిలో ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో స్థానిక రైతులతో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అలాగే పలు మండలాల్లో ముగింపు సమావేశాలు నిర్వహించారు. డి. హీరేహాళ్ మండలం మురిడిలో నిర్వహించిన ముగింపు సమావేశానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హాజరయ్యారు. రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం సనప రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీలు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలతోపాటు భవిష్యత్‌లో చేపట్టే పనులపై రైతులకు తెలియజేశారు.

యాక్షన్ ప్లాన్ తయారీ

జిల్లాలోని రైతు సేవా కేంద్రాల వారిగా ఈ ఏడాది రబీ, వచ్చే ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను తయారు చేశారు. మండలాల వారిగా యాక్షన్‌ప్లాన్‌ను జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి పంపనున్నారు. మండలాల వారిగా వచ్చిన యాక్షన్ ప్లాన్‌ను క్రోడీకరించి, జిల్లాస్థాయి యాక్షన్ ప్లాన్‌ను వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపనున్నారు.

పెన్షనర్లు డీఎల్‌సీ సమర్పించాలి

ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య



రమణయ్యను సన్మానిస్తున్న పెన్షనర్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ప్రతి ఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరులోపు డీఎల్‌సీ(డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల)ను సమర్పించాలని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య పేర్కొన్నారు. అలాకాకుండా ముందుగా ఏ నెలలో సమర్పించినా ఆ సర్టిఫికెట్లు ఆమోదించబడవన్నారు. ఈ మేరకు బుధవారం ఎన్జీఓ హోంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ ఆధ్వర్యంలో పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానిక ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య మాట్లాడుతూ పెన్షనర్లు స్థానికంగా ఉన్నట్లయితే ఎస్‌టీఓ కార్యాలయాల్లోగానీ, మీసేవా కేంద్రాల్లోగానీ, పెన్షనర్ల సంఘాలు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తమ డీఎల్‌సీ సమర్పించాలన్నారు. అదే విధంగా విదేశాల్లో ఉన్న పెన్షనర్లు తమ డీఎల్‌సీలను అక్కడున్న ఎంబసీ కార్యాలయంలో సర్టిఫై చేయించుకొని ఎస్‌టీఓకు వీడియో కాల్ ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శీలా జయరామప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, ఎస్‌టీఓ లక్ష్మి, అనంతయ్య, సీనియర్ అకౌంటెంట్ మసూద్ వలిలతో పాటు పెన్షనర్లు పాల్గొన్నారు.

రేపు ఎన్నికలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 55 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఈనెల 5న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఈనెల 12న రెండో విడతలో 29 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో సహకార సంఘంలో ఏడు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఏకగ్రీవం కాకుండా ఎన్నిక అనివార్యమైతే చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. వెటర్నరీ డాక్టర్లను ఎన్నికల అధికారులు గా నియమించారు. తొలి విడతలో ఎన్నికల నిర్వహణకు పశుసంవర్థక శాఖ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లాలో 215 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలున్నాయి. 131 సంఘాలకు ఇదివరకే ఎన్నికలు జరిగాయి. మిగిలిన 84 సంఘాలకు ఎన్నికలు పూర్తైన తర్వాత జిల్లా సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నారు.

నేడు డీడీఓ కార్యాలయాల ప్రారంభం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) జిల్లాలోని మూడు డీడీఓ (డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి) కార్యాలయాలు గురువారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా వర్చ్యువల్‌గా ప్రారంభించనున్నారు. అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతపురం రూరల్ పంచాయతీలోని సచివాలయం -2 భవనంలో డీడీఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. డీడీఓ నాగశివలీల ప్రారంభోత్సవానికి సంబంధించి గత 3 రోజులుగా బిజీబిజీ ఉన్నారు. గుంతకల్లు డివిజన్‌కు సంబంధించి డీడీఓ విజయలక్ష్మి తగిన చర్యలు చేపట్టారు. కళ్యాణదుర్గం డివిజన్‌కు సంబంధించి డీడీఓ నాగేశ్వరశాస్త్రి ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీనియారిటీ జాబితా సిద్ధం చేయండి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ-వార్డు సచివాలయ సిబ్బందికి సంబంధించిన సీనియారిటీ జాబితా సిద్ధం చేయాలని గ్రామ - వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 9 లోపు సీనియార్టీ జాబితా తయారు చేయాలన్నారు. 10న జాబితాను ప్రచురించాలన్నారు. దీనిపై అభ్యంతరాలు 11 నుంచి 23వ తేదీ వరకు స్వీరించాలన్నారు. తుది జాబితాను ఈ నెల 30న ప్రకటించాలని పేర్కొన్నారు.

డ్రా దిశగా ఆంధ్ర, కర్ణాటక మ్యాచ్



సిద్ధూ కార్తీక్‌రెడ్డి



అక్షత్ ప్రభాకర్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ డ్రా దిశగా సాగుతోంది. కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19లో భాగంగా స్థానిక రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ మూడోరోజు కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 176-5తో మూడో రోజు ఆట ప్రారంభించిన కర్ణాటక జట్టు 148.1 ఓవర్లలో 392పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్ణాటక బ్యాటర్ అక్షత్ ప్రభాకర్ సెంచరీతో (112), సిద్దార్థ అఖిల్ 83, ధ్యాన్ హిరేమత్ 47 పరుగులతో రాణించారు. ఆంధ్ర బౌలర్ సిద్ధు కార్తీక్‌రెడ్డి 5వికెట్లు పడగొట్టాడు. అనంతరం 22 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర 18.1ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 36పరుగులు చేసింది. బ్యాటర్ కేహెచ్ వీరారెడ్డి 22పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నాడు.

ఇసుక ధరలకు రెక్కలు..!

(5వ పేజీ తరువాయి)

నదుల్లో ఇసుక రీచ్‌లు గుర్తించారు. గతంలో ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు, పీసీరేవు, తాడిమర్రి మండలం సీసీరేవులో ఇసుక తవ్వకాలు జరిగేవి. అయితే ప్రస్తుతం అక్కడ ఇసుక తవ్వకాల టెండర్లలో ఆధిపత్య పోరు ఉండటంతో పలువురు కాంట్రాక్టర్లు ఎవరికివారుగా చిత్రావతి నదిలో నీరు లేని చోట తవ్వకాలు చేపట్టి ఇసుక తరలిస్తున్నారు. చిత్రావతి నదిలో ఉప్పలపాడు, పీసీ, సీసీరేవు, దంపెట్ల, గరిశనపల్లి, ఇందుకూరు, డి.చెర్లోపల్లి, పెద్దకోట్ల, ధర్మవరం వద్ద పోతులనాగేపల్లి, పుట్టపర్తి, చిలమత్తూరు, గోరంట్ల ప్రాంతాల నుంచి ఇసుకను తవ్వి భారీ ధరకు విక్రయిస్తున్నారు. హిందూపురం పెన్నానదిలో బేవనహళ్లి, సతేబిందనూరు, కొడిగెనహళ్లి, తుమ్మలకుంట, పరిగి, రొద్దం ప్రాంతాల్లో భారీగా తవ్వకాలు చేపట్టి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా చిత్రావతి నదిలో సీసీ, పీసీ ఇసుక రీచ్‌లలో ధర్మవరంలో నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీల నాయకులు కొందరు బినామీలను పెట్టుకుని పోటీపడి ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా జిల్లా అంతటా అక్రమార్కులకు ఇసుక కాసుల వర్షం కురిపిస్తోంది. వీటిని అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీటి పేరుతో అదనపు బాదుడు

జిల్లాలో నెల రోజులుగా ఇసుక డిమాండ్‌ను బట్టి ధరలు పెంచేశారు. సాధారణ రోజుల్లో జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ట్రాక్టర్ ఇసుక రూ.1800 దొరికేది. ప్రస్తుతం రూ.3000 దాకా విక్రయిస్తున్నారు. కొత్తచెరువులో ట్రాక్టర్ రూ. 2లోపే దొరికే ఇసుక ప్రసుత్తం రూ. 3వేల పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు, పీసీ రేవుల నుంచి రవాణా చేసే ఇసుక నెల కిందట దాకా 20 టన్నుల టిప్పర్ రవాణా చార్జీలతో కలిపి ధర్మవరంలో రూ.15 వేలకు దొరికేది. ఇప్పుడు దానిపై ఒకేసారి రూ.3వేలదాకా పెంచారు. ఇసుక రీచ్‌లు సమీపంలోనే ఉన్నా ముదిగుబ్బలోనే ట్రాక్టర్ రూ. 3వేలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గోరంట్లలో 20 టన్నుల ఇసుక టిప్పర్ రూ.23 వేల ధర పలుకుతోంది. ధర్మవరంలో ట్రాక్టర్ రూ.3వేల పైమాటే. కొందరు చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో ముందస్తుగా ఇసుక డంప్‌లు చేసి ప్రసుత్తం కృతిమ కొరత సృష్టించి సామాన్యులను దోచేస్తున్నారు. ప్రభుత్వం ఉచిత విధానం ప్రకటించినా కొందరు అక్రమార్కులు నదుల్లో నీటి నిల్వతో ఇసుక లభ్యతలేదని చెప్పి, ధరలు పెంచి జేబులు నింపుకుంటున్నారు. ఈనేపథ్యంలో నిర్మాణ వ్యయం పెరిగి, సామాన్యులు నిర్మాణాలను నిలిపేసే పరిస్థితి ఏర్పడింది.

చిత్రావతి పక్కనే ఉన్నా..



ప్రభుత్వం ఇసుక పూర్తిగా ఉచితం అంటోంది. వ్యాపారులు చిత్రావతిలో ఇసును ఉచితంగా తీసుకుని రవాణా పేరుతో అధిక ధరలకు అమ్ముతున్నారు. మాకు చిత్రావతి నది పక్కనే ఉన్నా ట్రాక్టర్ ఇసుక రూ. 2500 పెట్టి కొనుగోలు చేయాల్సివస్తోంది. చిత్రావతిలో నీరు ఉందని కొందరు ధర పెంచి ట్రాక్టర్ రూ. 3వేలకు అమ్ముతున్నారు. అయినా నాణ్యమైన ఇసుక దొరకడంలేదు. పుట్టపర్తిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే వినియోగదారులకు నాణ్యమైన ఇసుకతోపాటు అదనపు భారం తగ్గుంది.

-శ్రీనివాసులు, ఇంటి నిర్మాణదారుడు, పుట్టపర్తి

పెన్నానది నుంచి..



మా గోరంట్ల పక్కనే చిత్రావతి నది ఉంది. ప్రస్తుతం నదిలో చాలా ప్రాంతాల్లో నీరు ఉంది. నదిలో ఇసుక దొరికిన నిర్మాణానికి పనికి వచ్చే పరిస్థితి లేదు. ఇసుక దొరక్కపోవడంతో 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెన్నా నది నుంచి ఇసుకను కొనుగోలు చేయాల్సివస్తోంది. ట్రాక్టర్ రూ. 3500 టిప్పర్ రూ.23 వేలు పెట్టి కొంటున్నాం. ఇసుక ధర పెరగడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిపేస్తున్నారు.

-వెంకటరామప్ప, భవన నిర్మాణ మేస్త్రీ, గోరంట్ల

కొరత రానియ్యం

చిత్రావతిలో సీసీ, పీసీ రేవుల్లో 2500 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. వర్షాకాలం నేపథ్యంలో చిత్రావతి నదిలో నీరు ఉంది. జిల్లాలో ప్రసుత్త అవసరాల ఎంత మేర ఉన్నాయన్నది ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. బుధవారం నుంచి సీసీ,పీసీ ఇసుక రీచ్‌ల్లో టెండర్లదారులు ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ఇసుక కొరత రానివ్వకుండా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

-ఓబుళరెడ్డి, భూగర్భ, గనులశాఖ జిల్లా అధికారి

లోకల్‌కే ప్రాధాన్యం

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి కసరత్తు

80లో 51పోస్టులు మున్సిపాలిటీలకే..

అనంతపురం విద్య, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సబ్జెక్టు టీచర్లు లేని పాఠశాలలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల(వలంటీర్లు) నియామకానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక అభ్యర్థులకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. జిల్లాకు 80 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు మంజూరైన విషయం తెలిసిందే. ఇందులో ఎస్‌జీటీ 20, స్కూల్ అసిసెంట్ 60 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులను ఆయా పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనరే కేటాయించి జాబితా పంపారు. అయితే వీటిలో కొన్ని పోస్టులను అవసరం ఉన్న ఇతర స్కూళ్లకు మార్పు చేయడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు ఆలోచించి ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లారు. ఇందుకు కమిషనర్ అంగీకరించకపోవడంతో పాటు ఒక్క పోస్టు కూడా మార్పు చేయకూడదని, అలా ఎవరైనా చేస్తే చర్యలు తప్పవని డీఈఓలను హెచ్చరించారు. దీంతో రాష్ట్రశాఖ నుంచి వచ్చి జాబితా మేరకు ఆయా పాఠశాలలకే అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఇవ్వనున్నట్లు డీఈఓ వెల్లడించారు.

మున్సిపాలిటీలకే అధికం

జిల్లాకు కేటాయించిన 80 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులలో అత్యధికంగా మున్సిపాలిటీలకే కేటాయించారు. జిల్లాలోని రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, మున్సిపాలిటీలతో పాటు అనంత కార్పొరేషన్‌కు కలిపి 51 పోస్టులు కేటాయించారు. ఇందులో ఎస్జీటీ 14, స్కూల్ అసిస్టెంట్ 37పోస్టులు మున్సిపాలిటీలకే కేటాయించారు. మిగిలిన 29 పోస్టులలో గవర్నమెంట్ స్కూళ్లకు 4, మండల, జిల్లా పరిషత్ స్కూళ్లకు 25 పోస్టులు మాత్రమే కేటాయించారు. ఇందులో అత్యధికంగా గుమ్మఘట్ట 8, డి. హీరేహాళ్ 5, రాయదుర్గం 5, అనంతపురం, అనంతపురంరూరల్ కలిపి 3, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం, కణేకల్లు, కుందుర్పి, శెట్టూరు మండలాలలో ఒక్కో పోస్టు ఉన్నాయి.

రిజర్వేషన్లు లేవు

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలలో రిజర్వేషన్లు ఉండవని డీఈఓ ప్రసాద్‌బాబు అన్నారు. విద్యార్హత, స్థానికత ఆధారంగా ప్రాధాన్యం ఇస్తామన్నారు. లోకల్‌లో పోటీ ఉంటే అపుడు అకడమిక్‌కు 75శాతం, ప్రొఫెషనల్‌కు 25శాతం మార్కులు తీసుకొని అందులో ఎవరికి అర్హత ఉందో వారికే పోస్టు ఇస్తామన్నారు. అభ్యర్థులు ఆయా మండలాల ఎంఈఓలకు దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కమిషనర్ మార్గదర్శకాల మేరకు అభ్యర్థుల ఎంపిక చేపడతామన్నారు. కలెక్టరు ఆమోదంతో ఈనెల 8వతేదీకి నియామక ఉత్తర్వులు ఇస్తామని డీఈఓ తెలిపారు.

స్పందన లేక..!

పోలీసుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

ఆత్మహత్యకు యత్నించిన ఇంటర్ విద్యార్థిని మృతి



స్పందన (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థి దురుసుతనం, పోలీసుల నిర్లక్ష్యం కలగలిసి ఓ నిండుప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి బుధవారం మృతి చెందింది. ఈమె గతనెల 26న ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పులేటిపల్లి గ్రామానికి చెందిన అమల, ఆంజనేయులు దంపతుల కుమార్తె స్పందన(17)ధర్మవరంలోని ఓ ప్రైవేటు కాలేజ్‌లో ఇంటర్ సెకండియర్ చదివేది. ఇదే మండలంలోని మరో గ్రామానికి చెందిన విద్యార్థి ధర్మవరంలో మరో కాలేజ్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బస్సులో కాలేజీకి వెళ్లివచ్చే క్రమంలో తరుచూ ఆ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. వైఖరి మార్చుకోవాలని ఆమె తీవ్రంగా హెచ్చరించింది. దీంతో ఆ విద్యార్థి నానా దుర్భాషలాడుతూ విచక్షణారహితంగా బస్సులోనే దాడి చేశారు. ధర్మవరంలో బస్సు దిగి కాలేజీకి వెళ్తున్న సందర్భంలోనూ మరోసారి దాడి చేశాడు. దీంతో ఆ విద్యార్థిని పట్టణంలోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంఘటన గురించి తెలిపింది. చెన్నేకొత్తపల్లి పరిధిలో జరిగిందని, అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలని పోలీసులు చెప్పి పంపించారు. దీంతో ఆ విద్యార్థిని గత నెల 26న తల్లిదండ్రులతో కలిసి చెన్నేకొత్తపల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అయితే అక్కడ పోలీసులు ఫిర్యాదుపై పెద్దగా స్పందించలేదు. పోలీసుల తీరుతో మనస్తాపానికి గురైన బాలిక ఇంటికి వెళ్లి ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి ఆ విద్యార్థినిని వేధించి, దాడి చేసిన విద్యార్థిపై ఆత్మహత్యకు ప్రేరేపణ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా తాము ఫిర్యాదు చేసిన రోజే పోలీసులు సక్రమంగా వ్యవహరించి ఉంటే తాము తమ బిడ్డను కోల్పోయేవారం కాదని మృతురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే తమకు కడుపుకోత మిగిలిందని విలపించారు.

అమ్మ.. అశ్వత్థరెడ్డీ..!

భార్య ఖాతాకి నిధుల మళ్లింపు

రికార్డులు ఇవ్వకుండా డ్రామాలు

వెలుగులోకి కంబదూరు కార్యదర్శి లీలలు

డీపీఓకి ఫిర్యాదు చేయనున్న ప్రస్తుత కార్యదర్శి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కంబదూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ సస్పెండ్ అయిన అశ్వత్థరెడ్డి లీలలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఒకే ఫోన్ నంబరుతో 3714 కుటుంబాలను నమోదు చేయడంతో ఆయన్ను ఇదివరకే సస్పెండ్ చేశారు. ఇది మాత్రమే కాదు ఆయన ఇన్‌చార్జ్‌గా పని చేసిన నాలుగు పంచాయతీల్లోనూ మూడో కంటికి తెలియకుండా నిధులను తన భార్య సుమలత పేరు మీదికి బదిలీ చేసుకున్నాడు. ఈ విషయం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. 15 రోజుల వ్యవధిలోనే పంచాయతీలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు. అయితే అందుకు సంబంధించి రికార్డులు మాత్రం చూపడం లేదు. ఇదే పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ఏజీ ఆడిట్ టీమ్ పలు రికార్డులు తనిఖీ చేసినట్లు తెలిసింది. అయితే ఆ కార్యదర్శి తమ పరిధిలో ఖర్చు చేసిన వివరాలకు సంబంధించి రికార్డులు అందించకుండా 2021-22 ఏడాదికి సంబంధించి రికార్డులు అందించి చేతులు దులుపుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆ కార్యదర్శి సస్పెన్షన్‌లో ఉండటంతో ఆయన లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్యదర్శి పలు ఆధారాలతో డీపీఓకు ఫిర్యాదు చేయడానికి డీపీఓ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. డీపీఓ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగినట్లు తెలిసింది.

కార్యదర్శి అక్రమాల పర్వం ఇలా..

పంచాయతీ కార్యదర్శి అశ్వత్థరెడ్డి కంబదూరు పంచాయతీతో పాటు రాళ్లఅనంతపురం, కర్తనపర్తి, కురాకులపల్లి, చెన్నంపల్లి పంచాయతీలకు కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. కురాకులపల్లికి సంబంధించి దాదాపు రూ.10 లక్షల వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు తన భార్య సుమలత పేరుమీద బదిలీ చేసుకున్నారు. ప్రస్తుత కార్యదర్శి శ్రీరాములు ఈ విషయాన్ని గుర్తించి డిప్యూటీ ఎంపీడీఓ లీలాబాయితో పాటు ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. వాటికి సంబంధించి ఎమ్‌బుక్స్ గాని, ఓచర్స్ గాని ఏ ఒక్కటి ఇప్పటి వరకు చార్జ్ అప్పగించడంలో భాగంగా ఇవ్వనట్లు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నిధుల మళ్లింపునకు సంబంధించి ఆ పంచాయతీ సర్పంచ్‌కు కూడా సమాచారం లేదు. రాళ్ల అనంతపురం పంచాయతీకి సంబంధించి నవంబరు 7న, నీటి సరఫరా, శానిటేషన్ పేరుతో సీ. సుమలత పేరు మీద రూ.5,10,351 బదిలీ చేసినట్లు తెలిసింది. అక్టోబరు 22న కురాకులపల్లి పంచాయతీ నుంచి నీటి మోటార్స్ ఏర్పాటుకు, పైప్‌లైన్స్ ఏర్పాటు పేరుతో అదే సీ. సుమలత పేరు మీదికి రూ.4,51,897 బదిలీ చేశారు. అదే పంచాయతీ నుంచి అక్టోబరు 29న వాటర్ వర్క్స్ పేరుతో సీ. సుమలత పేరుమీదికి రూ.5,01,283 బదిలీ చేశారు. కేవలం 15 రోజుల్లోనే రూ.14,63,531 నిధులు దారి మళ్లించినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతోపాటు రికార్డులన్నీ ఏజీ ఆడిట్‌కు అందిస్తే, మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేసి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.17తో, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 37టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పంచాయతీల్లో లూటీ..!

(5వ పేజీ తరువాయి)

ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. నిధుల దుర్వినియోగంపై సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం.

ఆ అధికారి కనుసన్నల్లోనే..

సర్పంచ్‌లతో ఓ అధికారి కుమ్మక్కై నిధులను పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో ఆ అధికారి ములాఖత్ అయి.. ఎక్కువగా వారికే పనులు చేస్తూ, ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతపురంలోనే ఉంటూ వసూళ్ల పర్వం సాగిస్తున్నారని మండలంలో చర్చ సాగుతోంది. కంప్యూటర్, రికార్డులన్నీ అనంతపురంలో పెట్టుకుని అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

విచారించి.. చర్యలు తీసుకుంటాం

ఆయా పంచాయతీల్లో నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇప్పటికే ఆయా పంచాయతీల రికార్డులను తనిఖీ చేస్తున్నాం. విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

-సూర్యనారాయణ, ఎంపీడీఓ, కంబదూరు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కొండయ్య (ఫైల్)

పామిడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. పామిడి మండలంలోని పాళ్యం గ్రామానికి చెందిన కొండయ్య(58) అనే రైతు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొండయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక నాలుగు ఎకరాలలో ఎకరా పొలం అమ్మేశారు. అయినప్పటికీ దాదాపు రూ. 6 లక్షలు అప్పు మిగిలింది. మూడు ఎకరాలలో సాగు చేస్తున్న చీనీ చెట్లు కోతకు వచ్చేందుకు మరో మూడేళ్లు పడుతుందని.. అంతవరకూ అప్పుల బాధను తాళలేక పొలంలోనే పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పామిడి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్సకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య శ్యామల, కుమారుడు గోపాలకృష్ణ ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొలెరో వాహనానికి నిప్పు

అప్రమత్తమైన పోలీసులు



కాలిపోయిన బొలెరో వాహనాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

యల్లనూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లిలో విజయ్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన బొలెరో వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నిప్పుపెట్టినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. విజయ్‌కుమార్ తన బొలెరో పికప్ వాహనాన్ని ఇంటి ముందు ఉంచారు. సుమారు రాత్రి 11గంటల ప్రాంతంలో వాహనం నుంచి మంటలు కనిపించడంతో వెళ్లి ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. అరటిగెలలు మార్కెట్‌కు తరలించేందుకు వాహనం అద్దెకు పంపుతానని బాధితుడు తెలిపారు. వాహన విలువ సుమారు రూ.6లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. గిట్టనివారు ఈ పనిచేసి ఉంటారని బాధితుడు వాపోయాడు.

అప్రమత్తమైన పోలీసులు

ఫ్యాక్షన్ గ్రామమైన వెన్నపూసపల్లిలో అర్ధరాత్రి బొలెరో వాహనం దగ్ధమైన విషయం తెలియగానే హుటాహుటిన పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. బుధవారం ఉదయం సీఐ సత్యఏసుబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, డాగ్, క్లూస్‌టీంను రప్పించి విచారణ చేపట్టారు.

వందే భారత్‌కు ప్రశాంతి నిలయంలో స్టాపింగ్

గుంతకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కలబురగి-బెంగళూరు-కలబురగి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లోనూ నిలపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలును జనవరి 2వ తేదీ నుంచి ఎస్ఎస్‌పీఎన్ స్టేషన్‌లో రెండు నిమిషాలసేపు స్టాపింగ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే ఈ రైలు వేళలను కూడా సవరించినట్లు తెలిపారు. కలబురగి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (నం. 22231) ఉదయం 5-15 గంటలకు కలబురగిలో బయలుదేరి, మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరుకు చేరేది. ఇకపై ఈ రైలు ఉదయం 6-10 గంటలకు బయలుదేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22232) బెంగళూరులో 15 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరి, మునుపటి సమయంలోనే గమ్యస్థానానికి చేరుతుందన్నారు. ఇదేవిధంగా యశ్వంతపూర్-మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ (నం. 17212) బెంగళూరులో జనవరి 1 నుంచి మధ్యాహ్నం 1-15 గంటలకు కాకుండా 12-45 గంటలకే బయలుదేరుతుందన్నారు. కానీ గమ్యస్థానానికి యథా ప్రకారంగానే చేరుతుందన్నారు. బెంగళూరు-భువనేశ్వర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (నం. 18464)ను గిద్దలూరు స్టేషన్ నుంచి డోన్ స్టేషన్ వరకూ సమయాలను మార్పుచేసినట్లు తెలియజేశారు. ముంబై-కోయంబత్తూరు కుర్లా ఎక్స్‌ప్రెస్ (నం. 11013) జనవరి 1 నుంచి ధర్మవరం నుంచి ధర్మపురం స్టేషన్ వరకూ వేళలను స్వల్పంగా మార్పుచేసినట్లు వివరించారు.

న్యూస్ బాక్స్

వంకమద్దిచెరువుకు కృష్ణాజలాలు


చెరువుకు చేరుతున్న నీరు

నంబులపూలకుంట, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వంకమద్ది చెరువుకు బుధవారం హంద్రీనీవా కృష్ణా జలాలను విడుదల చేసినట్టు ఎంపీపీ రాము, సర్పంచ్ రాధమ్మ, రైతులు దండే రవిశంకర్, నరసింహులు, వంకమద్ది రవి, బాషా తెలిపారు. 18వ ప్యాకేజీలో ఉన్న హంద్రీనీవా మెయిన్ కాలువ ద్వారా వంకమద్ది చెరువుకు నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని వెలిచెలమల, గోపాలపురం, గౌనపేట చెరువులు నింపి, వంకమద్ది చెరువుకు నీరు పారుతోందన్నారు. ఈ చెరువు కింద ఎస్పీకుంట, మర్రికొమ్మదిన్నె, వంకమద్ది పంచాయతీ రైతులకు 300 ఎకరాలకు పైగా ఆకట్టు భూమి ఉంది. చెరువుకు నీరు రావడంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ప్రభుత్వానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ధర్మవరం రూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నేలకోట గ్రామంలో బుధవారం వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాలతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. సంస్కృతి సేవాస మితి, బెంగళూరు వైట్‌ఫీల్డ్ వైదేహి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెదిన 225 మంది వైద్యచికిత్సలు చేయించుకున్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు వైద్యపరీక్షలు పర్యవేక్షించారు.

పాఠశాలను సందర్శించిన డైట్ ప్రిన్సిపాల్

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను బుధవారం డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ-1రాజేశ్వరి, లెక్చరర్ మేరి ఎడ్వినా సందర్శించారు. విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి పరీక్షించారు. అనంతరం మెగా పీటీఎం ఆహ్వాన పత్రికలను ఎంఈఓ-1 రాజేశ్వరి చేతులమీదుగా పంపిణీ చేయించారు. పాఠశాల హెచ్‌ఎం జానకి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెడపల్లిలో డీఎస్పీ గ్రామసభ

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, ప్రజల రక్షణ ప్రధాన లక్ష్యంగా పోలీసుశాఖ చేపట్టిన వారధి కార్యక్రమంలో భాగంగా పెడపల్లిలో బుధవారం రాత్రి డీఎస్పీ విజయ్‌కుమార్ గ్రామసభను నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో నిర్వహించిన గ్రామసభలో డీఎస్పీ మాట్లాడుతూ... మహిళలు బాలికలపై జరుగుతున్న నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్‌సేఫ్టీ, రోడ్డుభద్రత, బాల్యవివాహాల ప్రభావాలు, పోక్సో తదితర విషయాలను ప్రజలకు వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి :సీఐ

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప సూచించారు. ఆయన బుధవారం పట్టణంలోని డీఎల్‌ఆర్ కాలనీలో పలు విషయాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోకి కొత్తవారు ఎవరైనా వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావా లని సూచించారు.శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సబ్సిడీతో ఉలవల పంపిణీ

బత్తలపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలలో బుధవారం రైతులకు సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేశారు. మండలంలో సకాలంలో వర్షాలు కురియక వేరుశనగ సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో ఒక్కో రైతుకు 10కేజీల ఉలవలు అందిస్తోందని ఏఓ ఓబిరెడ్డి తెలిపారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

నల్లచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. మంగళవారం రాత్రి స్కూల్ ముగించుకుని బుధవారం ఉదయం రోజూ లాగానే పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ముగ్గులు వేసి పూజలుచేసిన దృశ్యాన్ని గమనించి ఉపాధ్యాయులకు తెలియజేశారు. వెంటనే ఉపాధ్యాయులు పరిశీలించి వెంటనే ఆ ప్రదేశాన్ని నీటితో కడిగించారు. విషయం దావానలంలా వ్యాపించడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళలో పాఠశాల ఆవరణంలో క్షుద్రపూజలు చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

లారీలు ఢీ - ఇద్దరికి తీవ్రగాయాలు


ప్రమాదంలో నుజ్జయిన లారీలు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుకుంటపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రెండు సిమెంట్ లారీలు ఢీకొన్నాయి. ప్రమాదంలో డ్రైవర్లు మోసీన్, గంగరాజులు తీవ్రంగా గాయపడ్డారు. పల్నాడు జిల్లా దాసేపల్లి నుంచి బెంగళూరుకు వెళ్తున్న సిమెంట్ లారీ, బెంగళూరు నుంచి ఎర్రగుంట్లకు వెళ్తున్న ఖాళీ సిమెంట్ ట్యాంకర్ లారీ పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో బెంగళూరు నుంచి ఎర్రగుంట్లకు వెళ్తున్న ట్యాంకర్ లారీ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. దీంతో డ్రైవర్ మోసిన్ లారీలో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది, యువకులు అక్కడికి చేరుకున్నారు. దాదాపు అరగంట శ్రమించి ఇరుక్కుపోయిన మోసిన్‌ను అతికష్టం మీద బయటకు లాగారు. ఇంకో లారీ డ్రైవర్ గంగరాజు తీవ్ర రక్తగాయాలతో బయటపడ్డాడు. ఇరువురికీ 108 ఈఎంటీ హేమలత ప్రథమచికిత్స చేసి 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు మంగళకర విద్యార్థి


విద్యార్థిని సన్మానిస్తున్న సురేష్‌కుమార్

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): అంతర్ జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ టోర్న మెంట్‌లో తమ కళాశాలకు చెందిన విద్యార్థి బాబు ఉత్తమ ప్రతిభ కనపరిచి సీనియర్ మెన్ ఫుట్‌బాల్ సంతోష్‌ట్రోఫీ జాతీయజట్టుకు ఎంపికైనట్లు మంగళకర ఎడ్యుకేషనల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ తమ కళాశాలలో బీబీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న బాబు ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన అంతరజిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచి సీనియర్ మెన్ సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ సీనియర్ జాతీయజట్టుకు ఆంధ్రప్రదేశ్ తరుపున ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థి బాబును ఆయనతో పాటు మంగళకర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యాప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, మంగళకర డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు పీడీ, శ్రీనివాసులు, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ముందు మరిన్ని ఉన్నత అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం


నిరుపయోగంగా చెట్ల మధ్యలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



సంపద తయారీ కేంద్రానికి రంగులు మార్చకుండా వదిలేసిన దృశ్యం

నల్లచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దిమడుగు పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు సంపద కేంద్రాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేసినట్లు పంచాయతీ ప్రజలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 19 నెలలు అవుతున్నా ఇప్పటికీ ఆ చెత్త సంపద కేంద్రంపై జగనన్న స్వచ్ఛ సంకల్పం అనే పేరు, రంగులు ఉండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వదిలి సంపద కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, సంపద కేంద్రంపై ఉన్న పేర్లను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లాభసాటి వ్యవసాయమే ప్రభుత్వ లక్ష్యం

● కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి


మహిళా రైతు వనజను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, పాల్గొన్న కలెక్టర్

నల్లమాడ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నా... మీకోసం కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికలముందు రైతులకిచ్చిన హామీ మేరకు పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న ఉద్దేశ్యంతో పంచసూత్రాలను తీసుకొచ్చారని, రైతును రాజు చేయాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం చేపట్టి, పంచసూత్రాలు అమలు చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో పీఎం ధనధాన్యయోజన పథకం తీసుకొచ్చి ఆధునిక సాంకేతిక పద్ధతులతో మేలైన దిగుబడులు సాధించడానికి రైతులకు శిక్షణిస్తోందన్నారు. రైతు సమస్యలపై అద్భుతంగా మాట్లాడిన దొన్నికోటకు చెందిన కేశవరెడ్డి, మహిళ రైతు వనజను ఎమ్మెల్యే, కలెక్టర్ అభినందించారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు చైర్మన్ పూల శివప్రసాద్, సర్పంచ్ భారతి, సింగల్‌విండో అధ్యక్షుడు రమణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ షైలే శివశంకర్, కూటమి నాయకులు ఎల్‌వీసీ నరసింహులు, శరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి రామునాయక్, జిల్లా పశుసంవర్ధకాధికారి శుభదాస్, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ అధికారి సుదర్శన్, తహసీల్దార్ మనోజ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నష్టపోకూడదనే పంచసూత్రాలు

ఎమ్మెల్యే కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

గాండ్లపెంట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక విధానాలతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అందుకే పంచసూత్రాలను రూపొందించి రైతులకు అవగాహన కల్పిస్తోందని పేర్కొన్నారు. మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీలో నిర్వహించిన రైతన్నా... మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందికుంట, ఆర్డీఓ వీవీఎస్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. అలాగే గత ప్రభుత్వంలో గుంతలమయంగా ఉన్న రాయచోటి-కదిరి ప్రధాన రహదారిని బాగు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే మరికొన్ని చోట్ల గాండ్లపెంట, రెక్కమాను, తాళ్ళకాలువ, ఎన్‌పీకుంట, దనియానిచెరువు తదితర ప్రాంతాల్లో కల్వర్టుల పనులు పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌తో చర్చించామన్నారు. గాండ్లపెంట మండలానికి కూడా వచ్చే ఏడాది హంద్రీనీవా నీరు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని పలు తండాలలో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ సనావుల్లా, తహసీల్దార్ బాబురావు, వ్యవసాయాధికారి షాదాబ్, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు సుధాకర, శివప్పనాయుడు, టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు రామాంజులరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, అక్రమ్ బాష తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


వెంగళమ్మచెరువు పీఏసీఎస్ వద్ద పాల్గొన్న అవగాహన కల్పిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. రైతు సేవా కేంద్రాలలో బుధవారం 'రైతన్నా... మీకోసం' వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి రూరల్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయంతోపాటు ధర్మవరం, బుక్కపట్నం, బత్తలపల్లి, ముదిగుబ్బ, అమడగూరు, నంబులపూలకుంట, ఓబుళదేవర చెరువు, తనకల్లు తదితర మండలాల్లోని రైతు సేవా కేంద్రాలలో రైతులకు పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గడిచిన మూడు సీజన్లలో సాగు చేసిన పంటల సాగు సరళి, సమస్యలు.. రాబోయో మూడు సీజన్లలో రైతులు ఏఏ పంటలు సాగు చేస్తారు అనే విషయాలపై రైతులతో చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సుమంత్ (ఫైల్)

కొత్తచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పురోహితుడు, యువకుడు సుమంత్(30) లేపాక్షి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. .పట్టణానికి చెందిన మురళీశర్మ, ఉషారాణి దంపతుల పెద్దకుమారుడు సుమంత్, అతని స్నేహితుడు శ్రీదత్త ద్విచక్ర వాహనంలో లేపాక్షి ఆలయ సందర్శనానికి మంగళవారం వెళ్లారు. తిరిగి కొత్తచెరువుకు వస్తుండగా కోడూరు చెక్‌పోస్టు వద్ద కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపు కిందకు పడ్డారు. సుమంత్ తలకు తీవ్ర గాయాలు కాగా హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించినవైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారిన కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు వారు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుద ర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కదిరి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొన్ని పాఠశాలలో ఖాళీగా ఉన్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ చెన్నక్రిష్ణ బుధవారం ఓప్రకటనలోతెలిపారు. అభ్యర్థులు శుక్రవారం 5గంటల వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందచేయవచ్చిని తెలిపారు. మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో తెలుగు మెయిన్, ఎస్టీటీ, నిజాంవలీకాలనీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, కదిరి మున్సిపల్ హైస్కూల్‌లో తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్లు, రాణీపేట, కుటాగుళ్లలో హిందీ అసిస్టెంటు పోస్టులు, గవర్నమెంట్ హైస్కూల్‌లో సోషియల్ అసిస్టెంటు, నిజాంవలీ కాలనీలో ఫిజికల్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

● తనకల్లు: మండలంలోని వేపలపల్లి పాఠశాలలో ఖాళీగా ఉన్న అకడమిక్ వలంటీరీ పోస్టుకు శుక్రవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారులు బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఈపోస్టుకు టీటీసీ, బిఇడి చదివి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఎంఇఓ కార్యాలయలో అందజేయాలన్నారు.

రేపు ఎమ్మెల్యే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకటసాయి ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారిజయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి తెలిపారు. అమడగూరు, నల్లమాడ, ఓబుళదేవరచెరువు మండలాల ప్రజా సమ్యలపై వినతులు స్వీకరిస్తారన్నారు. సిమెంట్ రోడ్ల ప్రతిపాదనలను సంబంధిత పంచాయతీల నాయకులుగురువారం మధ్యాహ్నం ఓడీసీలోని టీడీపీ కార్యాలయంలో అందజేయాలని వారు కోరారు.

12న ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

ఉత్తర్వులు జారీ చేసిన ఆర్డీఓ


అమడగూరు ఎంపీడీఓ కార్యాలయం

అమడగూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ప్రసాద్ రెడ్డిపై ఈనెల 12వ తేదీన అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా మండలంలో ఉన్న ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులకు సమా వేశ తేదీని తెలియపరుస్తూ నోటీసులు జారీ జేశారు. ఎనిమిది మందిలో ఆరుగురికి నోటీసులు అందాయి, మరో ఇద్దరు అందులో బాటులో లేనందువల్ల వారికి ఫోన్‌ద్వారా తెలియజేసిన ట్లు అధికారులు తెలిపారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం తేదీ ఖరారు కావడంతో మండలంలో క్యాంపు రాజకీయాలు ఊపందుకున్నాయి. ఈ అంశం వైసీపీలో కలకలం రేపుతోంది. రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోయిన తరువాత పలుచోట్ల ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్, మేయర్‌పై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. అందులో ఎక్కువ మంది ఎంపీపీలు, మున్సిపల్ చైర్మ న్‌లు, మేయర్‌లు వారి స్థానాన్ని ని లుపుకోలేకపోయారు. ప్రస్తుతం పుట్టపర్తి నియోజకవర్గంలోని అమ డగూరు మండలంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో నియోజకవర్గం అంతా పెద్దఎత్తున చర్చ మొదలైంది. గతంలో ఎంపీపీ పదవి మార్పుపై పార్టీ తీర్మానాన్ని ఎంపీపీ ఉల్లంఘించారని అందుకు అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలుపుతున్నట్లు పలువురు ఎంపీటీసీ సభ్యులు చెబుతున్నారు. ఎంఈపీ పదవిని ఆశ్రయిస్తున్న కోగర జయమ్మ మిగతా సభ్యులందరినీ తన ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


తాడిమర్రిలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు, టీచర్లు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం భవిత కేంద్రాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం, కదిరి పట్టణాలతో పాటు తాడిమర్రి, ముదిగుబ్బ, ఓబుళదేవర చెరువు నల్లచెరువు మండల కేంద్రాలలోని భవత కేంద్రాలలో దివ్యాంగ విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. సంబంధిత ఎంఈఓలు, ఉపాధ్యాయులు, వైద్యాధి కారులు పాల్గొన్నారు. దివ్యాంగులను ప్రోత్సహిస్తే వారు ఎంతపని అయిన సాధించగలుగుతారని అన్నారు. వారిని అందరితో సమానంగా చూడాలని సూచించారు. అదేవిధంగా దివ్యాంగ విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి, ప్రతిభచూపిన వారికి బహుమతులు అందజేశారు.

భూ సరిహద్దు దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి : కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల సర్వే సరిహద్దు నిర్ధారణ నిమిత్తం అందే ఎఫ్‌లైన్ దరఖాస్తులను నాణ్యతతో వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ జిల్లాలోని మండల సర్వేయరు, డిప్యూటీ సర్వేయర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా బాధ్యతాయుతంగా కృషిచేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం భూమిసర్వే సరిహద్దు నిర్ధారణకు అందిన ఎఫ్‌లైన్ దరఖాస్తుల పరిష్కారంపై మండల సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, సర్వే శాఖ ఏడీ విజయశాంతి, మండల సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

● జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి


మాట్లాడుతున్న న్యాయాధికారి మజీద్ సయ్యద్ పస్వల్లా

కొత్తచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రోత్సహిస్తే మిగతావారితో సమంగా రాణించగలరని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మజీదు సయ్యద్ పస్వల్లా పేర్కొన్నారు. స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయాధికారితో పాటు సీఐ మారుతీశంకర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగిరెడ్డి, ఎంఈఓ-1 సోమశేఖర్‌నాయుడు, ఎంఈఓ-2 జయచంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం న్యాయాధికారి మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహమిస్తోందన్నారు. ఫలితంగానే నేడు అనేక క్రీడల్లో దివ్యాంగులు సత్తా చాటుతున్నారని తెలిపారు. అనంతరం ఇటీవల దివ్యాంగులకు నిర్వహించిన ఆటలపోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రమాదేవి, రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగేంద్రప్రసాద్, మల్లికార్జున, పాఠశాల హెచ్‌ఎం గోపాల్, ఈఐఈఆర్‌టీలు రమేశ్‌బాబు, మల్లికార్జున, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, పద్మజ, అరుణ, ఐసీడీఎస్ ప్రభావతి పాల్గొన్నారు.

ప్రజల మనోభావాలతో ఆడుకోరాదు

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకంమధు


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటలను వక్రీకరించి ప్రజల మనోభావాలతో ఆడుకోవడం మంచిదికాదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం పట్టణం లోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్‌కు రెండు తెలుగురాష్ట్రాలూ సమానమే అన్నారు. ఆయన ఎప్పుడూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధిని కోరుకుంటారన్నారు. కోనసీమ ఎప్పుడూ పచ్చదనంతో ఉండేది, ఈ పచ్చదనం గురించి ఆంధ్ర, తెలంగాణ ప్రజలు చర్చించుకునే వారు అన్నారే కానీ ఎక్కడా తెలంగాణ ప్రజల వల్ల అన్యాయం జరిగిందని అనలేదన్నారు. దీనిని వక్రీకరించడం బావ్యం కాదన్నారు. అదేవిధంగా పేర్నినాని లాంటి వాళ్ల తిన్నింటి వాసాలు లెక్కపెడతారని గ్రహించిన ఆంధ్ర ప్రజలు ఆయనకు, ఆయన పార్టీకి గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా జ్ఞానోదయం కాలేదని మండిపడ్డారు. త్వరలో వైసీపీకి గోరీ కట్టే రోజు దగ్గరలోనే ఉందని ఆయన అన్నారు.

ఇళ్ల పట్టాల కోసం ధర్నా


తనకల్లు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బొంతపల్లి సర్వేనంబర్ 183ఎలో గత నాలుగు సంవత్సరాలనుంచి నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారందరికి వెంటనే ఇంటి పట్టాలు మంజూరుచేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ మాట్లాడుతూ నిరుపే దలకు ఇంటిపట్టాలు ఇచ్చేవరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. డివిజన్ కార్యదర్శి నల్లజోడు పవన్, మండల కార్యదర్శి రెడ్డెప్ప, కదిరి పట్టణ కార్యదర్శి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


ప్రతిభ కనబరచిన విద్యార్థులను సన్మానించిన సంధా రాఘవ

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వివిధ క్రీడా పోటీల్లో సత్తా చాటిన ధర్మవరం విద్యార్థులను చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధా రాఘవ బుధవారం సన్మానిం చారు. రాష్ట్రస్థాయి కరాటే కురాస్ పోటీల్లో అర్చన, సింధు, రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో మహీధర్, సాహిత్య, హారిక, సుస్మిత, అఖిలభాను ప్రతిభ కనబరిచారు. చిగిచెర్లలో గతనెలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జూడో పోటీలలో సింధు, దాక్షాయణి, గవ్వల యువసంధ్య ప్రతిభ కనబరచారని కోచ్ ఇనాయత్‌బాషా తెలిపారు. వీరంతా బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరందరిని బుధవారం సంధా రాఘవ శాలువాలతో సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. క్రీడలలో అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంధా రవీంద్ర, జింకా పురుషోత్తం, కేశగాళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

'అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి'


మాట్లాడుతున్న వయోజన విద్య క్లస్టర్ పర్యవేక్షకులు ఉషారాణి

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిద్ధి, ధర్మవరం పట్టణాన్ని అక్షరాస్యతలో అగ్రస్థానంలో నిలపాలని వయోజన విద్య క్లస్టర్ పర్యవేక్షకులు ఉషారాణి మెప్మా సీఓలు, ఆర్పీలకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సాయికృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఉల్లాస్- అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వలంటీర్ టీచర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్‌తో పాటు వయోజన విద్య జిల్లా నోడల్ ఆఫీసర్ జనార్దన్‌గౌడ్, వయోజన విద్య పర్యవేక్షకులు ఉషారాణి, మెప్మా టీపీఆర్‌ఓ విజయబాస్కర్ పాల్గొన్నా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ధర్మవరంలో 7860 మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. మెప్మా సహకారంతో ఫిబ్రవరి 2026 వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు.మార్చిలో పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తించి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ

టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటూనే వాటికి పరిష్కారాలు చూపేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి కవితారాణి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు విద్య, మల్లికార్జున, ప్రమీల, నాయకులు గౌరీశంకర్, విశ్వనాథరెడ్డి, ఆంజినేయులు, చంద్ర, మంజు, గంగప్ప, చంద్రారెడ్డి, జనసేన నాయకులు చిన్న ప్రవీణ్ పాల్గొన్నారు.

● **సోమందేపల్లి:** మండలంలోని 13 రైతు సేవాకేంద్రాల్లో బుధవా రం రైతన్న మీకోసం వర్క్‌షాపులను అధికారులు నిర్వహించారు. చ ల్లాపల్లి గ్రామంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి, వ్యవసాయాశాఖ అధికారి విజయభారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్ ఉన్న పంటలు సాగుచేయాలని, చిరుధాన్యాలు పంటపై దృష్టిసారించాలన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ పథకం కింద సోమందేపల్లి మండల వ్యాప్తంగా 6446రైతులకు రూ4.32కోట్లు ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త భాస్కర్‌రావు

● **మడకశిర రూరల్:** రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అనంతపురం వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు భాస్కర్‌రావు, లక్ష్మణ్ తెలిపారు. రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా బుధవారం గుండుమల రైతు సేవాకేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిమాండ్ ఉన్న పంటల సాగు తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప, ప్రకృతి సేద్యం టీం లీడర్ రమేష్, మాజీ సర్పంచ్ చంద్రప్ప పాల్గొన్నారు.

● **గోరంట్ల:** మండలంలోని వానవోలు గ్రామంలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమం జరిగిది.. కార్యక్రమంలో ఎంపీడీఓ కమలాబాయి, ఏఓ శంకర్‌నాయక్, డాక్టర్ చంద్రశేఖర్, కూటమి నాయకులు, కన్వీనర్లు బాలక్రిష్ణచౌదరి, సంతోష్, నిమ్మల శ్రీధర్, పాయాల రమణ, జిలాన్‌బాషా, హరి తదితరులు పాల్గొన్నారు.

● **రొద్దం:** గ్రామీణ ప్రాంతంలో రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అడుగులు వేస్తుందని టీడీపీ నాయకులు మాధవనాయుడు పేర్కొన్నారు. బుధవారం రొద్దం మండల పరిధిలోని ఎం.కొత్తపల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను పొందాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, టైలర్ ఆంజనేయులు, కన్వీనర్ నరహరి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహులు, టీడీపీ అధికార ప్రతినిధి నరసింహులు, అశ్వర్థనారాయణ, మాజీ సర్పంచ్ నారాయణ, పుల్లప్ప చౌదరి, సిద్దన్న, బాబు, నగేష్, నాగరాజు, శేషు తదితరులు పాల్గొన్నారు.

● **గుడిబండ:** రైతు సంక్షేమాభివృద్ధి టీడీపీ ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏఓ వీరనరేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ముతుకూరు రైతు సేవా కేంద్రంలో మండల కన్వీనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సబ్సిడీతో ఎరువులు, డ్రిప్ పరికరాలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు చిత్రశేఖర్, యాదవ్, రాజు, మంజునాథ్, జయరామప్ప, ఏఈఓ శారదమ్మ, మంజుళ, రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.




అగళిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

● **అగళి:** మండలంలోని రైతుసేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖాధికారి నాగరాజు ఆధ్వర్యంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్బారావు, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పలు సూచనలు అందించారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు, పాడిపరిశ్రమ, నీటి భద్రత , పీఎం కిసాన్, రైతుభరోసా పథకాలపై, పంచసూత్రాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కిష్టఫర్ పాల్గొన్నారు.

● **రొళ్ల:** మండలంలోని ఎం.రాయాపురం రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, డ్రిప్, స్ప్రింక్లర్లు, తదితర వాటిపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మడకశిర మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

● **హిందూపురం:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం బుధవారం మిట్టమీదపల్లిలో జరిగింది. మండల వ్యాప్తంగా ఆయా రైతు సేవాకేంద్రాల్లో కార్యక్రమాలు జరిగాయి. మిట్టమీదపల్లిలో జరిగిన కార్యక్రమానికి మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, మండల కన్వీనర్ రాము, సింగిల్‌విండో చైర్మన్ శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటోడ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

అగళి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై బుధవారం ఎస్ఐ శోభారాణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఆటో రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

చిలమత్తూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాల అభివృద్ధికి బుధవారం టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణయాదవ్ రూ.10 వేలు అందజేశారు. అదేవిధంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు రూ.10 వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ అలారం అందజేశారు.

ప్రారంభమైన ఇండోర్ స్టేడియం పనులు

నెరవేరనున్న క్రీడాకారుల కల



వేగంగా జరుగుతున్న పనులు

హిందూపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో అర్థాంతరంగా ఆగిన ఇండోర్ స్టేడియం పనులను ప్రారంభించారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇండోర్ స్టేడియం పనులను రూ. 2 కోట్లతో ప్రారంభించింది. 2019 ఎన్నికల నాటికి రూ. 39 లక్షలతో 40 శాతం పనులు మాత్రమే చేశారు. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో స్టేడియం పనులు ఆపేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆడదాం ఆంధ్ర ప్రచార ఆర్భాటాలకే పరిమితమైంది. జగన్ ప్రభుత్వం ఐదేళ్లపాటు యువతను క్రీడలకు దూరం చేసింది. 1986లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఇదే మైదానంలో జిల్లాలోని అతి పెద్ద ఇండోర్ స్టేడియంని నిర్మించారు. అయితే అది శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పుడు దానిని ఎమ్మెల్యే బాలకృష్ణ టీడీపీ హయాంలో మరో ఇండోర్ స్టేడియంను తీసుకువచ్చారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి కానున్నాయి. దీంతో రెండు షటిల్ కోర్టులు, టేబుల్ టెన్నిస్‌కోర్టులను అత్యాధునికంగా నిర్మించడానికి సిద్ధం చేశారు. దీంతోపాటు స్టేడియం లోపల క్రీడాకారులకు ఆధునిక పరికరాలతో జిమ్ ఏర్పాటుకు అనుమతినిచ్చారు. ఇది పూర్తయితే క్రీడాకారులకు మరింత సౌలభ్యంగా ఉంటుంది.

నిరుపేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్

మంత్రి సవిత.. 48 మందికి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం మంత్రి సవిత పంపిణీ చేశారు. 48 కుటుంబాలకు రూ.20,19,339 చెక్కులను అందించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పెనుకొండ, సోమందేపల్లి, పరిగి, రొద్దం మండలాలకు చెందిన బాధితులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం ఆర్‌ఎఫ్ ఒక వరమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, గుట్టూరు సూరీ, ఎగువగడ్డ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మంత్రి ఆధ్వర్యంలో భోజనాలు

బాబయ్యస్వామి ఉరుసు మహోత్సవానికి వచ్చే భక్తులకు మంత్రి సవిత భోజన ఏర్పాట్లు చేశారు. బుధవారం మంత్రి సవిత పెట్రోల్ బంక్ వద్ద వచ్చే భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ 15ఏళ్లుగా ఉరుసుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం భోజనాలు, నీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, బాబుల్‌రెడ్డి, శ్రీనాథ్‌చౌదరి, మీసేవ సమీ, షౌకత్, రఘువీరచౌదరి, గుట్టూరు సూరీ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: తమిళనాడులో ఇటీవల నిర్వహించిన ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అత్యంత పెద్ద కరాటే ప్రదర్శనగా గిన్నిస్ వరల్డ్‌రికార్డ్ సాధించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక బ్రిలియన్స్ పాఠశాల విద్యార్థి యక్షిత్, అదే పాఠశాలలో కరాటే కోచ్‌గా పనిచేస్తున్న రామచంద్ర ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. వీరిని బుధవారం మంత్రి సవిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగవేణి పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

పెనుకొండ రూరల్: మండలం గోనిపేటలో మాజీ సర్పంచ్ నాగరాజు కుటుంబాన్ని మంత్రి సవిత బుధవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో నాగరాజు మృతిచెందగా బుధవారం మంత్రి గోనిపేటలోని నాగరాజు ఇంటికి వెళ్లి అతని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ



మాట్లాడుతున్న న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపాలని అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో ఏదో ఒక విధమైన విభిన్నమైన ప్రతిభ వారిలో దాగి ఉంటుందన్నారు. దానిని తల్లిదండ్రులు గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అంధుడైన లూయిస్‌బ్రెయిలీ ఎలాంటి నిరుత్సాహానికి గురికాకుండా పట్టుదలతో శ్రమించి అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు విభిన్నప్రతిభావంతులు కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, లయ, న్యాయవాదులు, భవిత కేంద్రం శిక్షకులు పాల్గొన్నారు. అదేవిధంగా భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీయాలన్నారు.

● మడకశిరటౌన్: దివ్యాంగుల కోసం ప్రభుత్వం చేయూతనిస్తోందని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయం లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిగా చేయూతను వారికి అందించడం జరుగుతోందన్నారు.

● సోమందేపల్లి: దివ్యాంగులను మనతో సమానంగా చూడాలని ఎంఈఓ ఆనంద్‌బాబు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భవిత కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీదేవి, మస్తాన్, ప్రత్యేక ఉపాధ్యాయులు లింగరాజు, మంజుళ తదితరులు పాల్గొన్నారు.

● గోరంట్ల: ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని పెనుకొండ డిప్యూటీ డీఈఓ జాన్‌రెడ్డెప్ప, ఎంఈఓ గోపాల్ అన్నారు. పట్టణంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం జరుపుకున్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలతోపాటు భవిత కేంద్రంలో విద్యాబోధన, శరీరక వైకల్యమున్న పిల్లలకు ఫిజియోథెరపి చికిత్సలు అందిస్తున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విద్యాసాగర్, దామోదర్‌రెడ్డి, నరసింహులు భవితకేంద్రం ఉపాధ్యాయులు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

● **పెనుకొండ:** స్థానిక భవిత కేంద్రంలో ఉపాధ్యాయుడు బాబావలి ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మహేష్, ఎంఈఓలు రాఘవయ్య, సుధాకర్, న్యాయవాదులు శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరిలోనూ లోపాలుంటాయని వాటిని అధిగమించి విజయం సాధించాలన్నారు.

● **లేపాక్షి:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ నాగరాజునాయక్ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు పట్టుదలతో అన్నిరంగాల్లోనూ ముందుండాలని వైకల్యాన్ని అధిగమించి భవిష్యత్తుపై దృష్టిసారించాలన్నారు.

● **మడకశిరటౌన్:** బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం న్యాయవాదుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. న్యాయవాదులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అశ్వర్థనారాయణ, ఉపాధ్యక్షులు హెచ్ ఎస్ కిష్టప్ప, సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, రాధాకృష్ణ, రాజన్న, గోపాల్‌రావు, త్రిలోక్, నాగేగౌడ్, హనుమంతరాయుడు, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

'అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి'

రొద్దం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరునికి స్వేచ్ఛ జీవితాన్ని ప్రసాదించిన మహనీయుడు అంబేడ్కర్ అని టీడీపీ నాయకులు మాధవనాయుడు పేర్కొన్నారు. బుధవారం రొద్దం మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా అందరూ హక్కులు, రిజర్వేషన్లు పొందేలా పొందుపరిచారన్నారు. అలాంటి వ్యక్తి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, టైలర్ ఆంజనేయులు, కన్వీనర్ నరహరి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహులు, టీడీపీ అధికార ప్రతినిధి నరసింహులు, అశ్వర్థనారాయణ, మాజీ సర్పంచ్ నారాయణ, పుల్లప్ప చౌదరి, సిద్దన్న, బాబు, నగేష్, నాగరాజు, శేషు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణదేవరాయల సర్కిల్ వైజంక్షన్‌లో రోడ్డుదాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

● పుట్టపర్తి జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి(45)ను మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి రెండు రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని అంచనా వేశారు. మృతదేహం కుళ్లిపోవడంతో ఆనవాళ్లు దొరకలేదన్నారు.

● దుద్దేబండ క్రాస్ సమీపంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని 40ఏళ్ల వయసుగల వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం ఎవరూ రాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారించారు.

గోరంట్ల: మండలపరిధిలోని కదిరి ప్రధాన రహదారిలో కోరేవాండ్లపల్లి సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొని వెంకటేష్, దేవేంద్ర బుధవారం తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని శీనప్పపల్లికి చెందిన వెంకటేష్ కోరేవాండ్లపల్లి వద్ద రహదారి దాటున్న సమయంలో కదిరి వైపునుంచి చిలమత్తూరు మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన దేవేంద్ర ద్విచక్రవాహనంపై వెళ్తూ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వెంకటేష్ తీవ్రంగా గాయపడగా దేవేంద్ర తలకు గాయాలైయ్యాయి. వీరిని 108లో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేశారు. మెరుగైన చికిత్సలకోసం ఇరువునికి హిందూపురం తరలించారు.

లేపాక్షి: లేపాక్షి జాతీయరహదారిపై బుధవారం కుర్లపల్లి క్రాస్‌వద్ద బొలేరో వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కుర్లపల్లి గ్రామానికి చెందిన కురుబ నారాయణప్ప(72) పనినిమిత్తం లేపాక్షికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తూ జాతీయరహదారి దాటుతుండగా కొడికొండ చెక్‌పోస్టు నుంచి హిందూపురానికి వెళ్తున్న కూరగాయలు తరలించే బొలేరో ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయాలి

న్యాయవాదుల డిమాండ్



సమావేశమైన న్యాయవాదులు

హిందూపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్ని సౌకర్యాలు, వసతులున్న హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బుధవారం సమావేశమైన న్యాయవాదులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎన్నికల ముందు హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకునే సమయం వచ్చిందన్నారు. ఇదిహిందూపురం ప్రజలు కోరుకుంటున్న బలమైన కోరిక అని అన్నారు. ఎమ్మెల్యే దీనిపై కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఇండాద్, క్రిష్ణమూర్తి, రత్నకుమార్, ఉదయ్‌సింహారెడ్డి, మురళి, వేణుగోపాల్, అబ్దుల్ రహిమాన్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎంఐఎం పార్టీ నాయకులు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని కోరారు.

ధర్మస్థల సంఘం సేవలు అమోఘం

రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి

పావగడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల గ్రామాభివృద్ధి సంఘం తరుపున సంస్థాపకులు వీరేంద్ర హెగ్డే నిర్వహిస్తున్న పథకాలు ఎంతో ఉత్తేజింపచేస్తున్నాయని పావగడ రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి కొనియాడారు. బుధవారం ఎస్ఎస్‌కె రంగ మందిరంలో నిర్వహించిన ధర్మస్థల బిల్వార్చన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధర్మస్థల సంఘం చేస్తున్న సేవలు ఎంతో అమోఘమని ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ అన్నారు. కార్యక్రమంలో సమాజ సేవకులు నాని, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప, పావగడ యోజన అధికారి మహేష్, మున్సిపల్ మాజీ అధ్యక్షులు సుదేష్‌కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచండి

ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి



కొడికొండ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

చిలమత్తూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోకి అక్రమంగా తరలి వచ్చే మద్యంపై నిఘా పెంచాలని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులోని ఎక్సైజ్ చెక్‌పోస్టుని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేసే అధికారులతో మద్యం అక్రమ రవాణాపై ఆరా తీశారు. సరిహద్దుగా ఉన్న కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తరలివచ్చే అవకాశం ఉందని, గట్టి నిఘా పెట్టాలన్నారు. వాహనాలను నిరంతరంగా తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మడకశిరటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గురువారం మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు పట్టణ అధ్యక్షులు నాగరాజు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జిల్లెడిగుంట గ్రామంలో కమ్యూనిటీ శ్యానిటరీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో, 11 గంటలకు ఆంజనేయస్వామి రథోత్సవం, 11.30 గంటలకు భక్తరహళ్లిలో పర్యటన, 2 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణపై ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలతో సమీక్షా సమావేశం, సాయంత్రం 6 గంటలకు హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి లక్షదీపోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.1.52 కోట్లు మంజూరు

గోరంట్ల, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వానవోలు గ్రామంలోని పురాతన శ్రీకస్తూరి రంగనాథస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు దేవదాయ శాఖ రూ.కోటి 52లక్షలు మంజూరు చేసినట్లు ఆలయ అర్చకులు శ్రీధర్‌స్వామి, కమిటీ సభ్యులు నవీన్‌కుమార్ తెలిపారు. దీనికితోడు విరాళాల రూపంలో రూ.38 లక్షలు అందాయి.

ఆహ్లాద వాతావరణంలో సమావేశాలు జరగాలి

సర్పంచ్ సరోజనాగేనాయక్



పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

గోరంట్ల, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాద వాతావరణంలో సమావేశాలు జరుపుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ సరోజనాగేనాయక్ అన్నారు. పట్టణంలోని మేజర్ పంచాయతీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఆవరణాలను బుధవారం శుభ్రం చేయించారు. ఈనెల 5న పాఠశాలల్లో మెగా పీటీఎంలు నిర్వహిస్తుండడంతో చర్యలు చేపట్టారు. గోరంట్లలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఎక్స్‌కావేటర్ ద్వారా ఆవరణాన్ని శుభ్రం చేసి చదును చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేనాయక్, ఉమ్మర్‌ఖాన్, స్కూల్‌కమిటీ చైర్మన్ నరసింహులు, ఉపాధ్యాయులు ఓబులేష్, బాబునాయక్, పీఈఓ ఆజీమ్‌బాషా ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వానవోలు ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం సహాయకులుగా (స్కూల్‌అసిస్టెంట్)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ జాన్‌రెడ్డెప్ప తెలిపారు. వానవోలు పాఠశాలలో ఖాళీగా ఉన్న సోషల్ స్కూల్ అసిస్టెంట్ నియామకంకోసం ప్రభుత్వం అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించుకోవడానికి అనుమతి ఇచ్చిందన్నారు. అర్హులైన అభ్యర్థులు వెంటనే మండలశాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

హిందీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు..

రొద్దం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెద్దగువ్వలపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందీపోస్టుకు దరఖాస్తుచేసుకోవాలని ఎంఈఓ జయభాస్కర్, అరవింద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు బీఈడీతోపాటు హిందీ పండిట్ చేసి ఉండాలన్నారు. రూ.12,500 వేతనం అందిస్తారన్నారు. ఆరునెలల కాలానికి పనిచేయాల్సి ఉంటుందన్నారు.

'భూముల విక్రయాలను అడ్డుకోండి'

సోమందేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండలం నడింపల్లి గ్రామంలో 376సర్వేనంబరులో భూమి వివాదం హైకోర్టులో ఉండగానే కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అందులో క్రయ విక్రయాలు జరుపుతున్నారని రైతులు బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిని కలిసి వినతి పత్రం అందించారు. తహసీల్దార్ మారుతి మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు బషీర్, అంజినప్ప, జహీర్, నంజుండప్ప, రామాంజినప్ప, మారెప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

సోమందేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఐటీయు జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కొండా వెంకటేశులు, శ్రీదేవి, మాట్లాడుతూ డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నం కేంద్రంగా జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు. ఈ బహిరంగ సభలకు కార్మికులందరూ పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కేటీ హళ్లికి గాంధీ గ్రామ పురస్కారం

పావగడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని కేటీ హళ్లి గ్రామ పంచాయతీకి 2023-24 సంవత్సరానికి గాను కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తరుపున గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ నుంచి గాంధీ గ్రామ పురస్కారం దక్కింది. పంచాయతీలో చేపట్టిన పనులు, చేసిన అభివృద్ధికిగాను ఈ అవార్డు దక్కింది. దీనికి కృషి చేసిన పంచాయతీ పీడీఓ మంజునాథ్, అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే చేతులమీదుగా గాంధీ గ్రామ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోని పలు పంచాయతీలకు మీసేవలు ఆదర్శం కావాలని పీడీఓ, అధ్యక్షులను మంత్రి అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న పీడీఓ, అధ్యక్షుడు